## క్లుప్తంగా

### చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత


ప్రక్కిలంక అంగన్‌వాడీ కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

**తాళ్లపూడి:** మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య శాఖ ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ పి.మోహనభారతి తెలిపారు. ప్రక్కిలంక బీసీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ భారతి మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో చలి వేంద్రాలను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హారికాగుప్త, సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి, ఆర్ఐ కె.రామకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్ ఉమా, ఆరోగ్య సిబ్బంది సుధారాణి, పుష్ప, సచివాలయ సర్వేయర్ పాల్గొన్నారు.

### నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**తాళ్లపూడి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో టీబీ వెంకటరమణ తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

### ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న సీఐ పీవీజీ తిలక్

**నిడదవోలు :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 60 మంది మోటార్ మెకానిక్ వర్కర్స్, 10 మంది మహిళా వాహనదారులకు రూ.30 వేల విలువైన 70 హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. లయన్ రంగా వేంకటేశ్వర రావు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ పీవీజీ తిలక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై పరమహంస, రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కొర్లెపర వెంకటరత్నకుమార్ పాల్గొన్నారు.

### యాభై శాతం సబ్సిడీపై అపరాల విత్తనాలు

**కొవ్వూరు:** రైతులకు యాభై శాతం సబ్సిడీపై మినుము, పెసర విత్తనాలు అందించనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధర రావు తెలిపారు. మండలంలో ఆరికిరేవుల, వాడపల్లిలో శుక్రవారం రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన రైతు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అపరాలు సాగు చేసే రైతులు అపరాలు అవసరమైతే తమ పేర్లను రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. మినుము వీడీఎన్-8 రకం విత్తనాలు 50 శాతం సబ్సిడీపై కిలో 70 రూపాయలకు అందిస్తున్నామన్నారు. పెసర విరాట్ రకం విత్తనం కిలో సబిడీ పోను రూ.65 అందిస్తున్నామని తెలిపారు. పెసర పంట అరవై రోజుల్లో, మినుము పంట 85 నుంచి తొంభై రోజుల్లో పంట చేతికి వస్తుందన్నారు. పచ్చిరొట్టను వేసుకుని భూమిలో కలియదున్నాలన్నారు. తద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు.

### డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలి

**కొవ్వూరు:** పట్టణంలో జగనన్న కాలనీ-3 ఖాళీగా ఉన్న స్థలాల్లో ఐదెకరాలను భూమిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, మరో ఐదెకరాలను బీసీ సంక్షేమ వసతి గృహానికి కేటాయించాలని సీఎం చంద్రబాబుకి వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గతంలో డిగ్రీ కళాశాలకు మునిసిపల్ వాటర్‌వర్క్స్‌కి చెందిన భూమిని కేటాయించి మళ్లీ వెనక్కి తీసుకున్నారని తెలిపారు.

### నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

**నిడదవోలు :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11.30 గంటలకు చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు.

# పల్లంట్ల హైస్కూల్లో సమస్యల తిష్ట

- ఐదు తరగతులు.. నాలుగు గదులు
- వరండాలోనే విద్యాబోధన
- తరగతి గదుల కొరత
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు


దేవరపల్లి మండలం పల్లంట్లలోని జెడ్పీ హైస్కూలు భవనం (ఫైల్)

**దేవరపల్లి:** మండలంలోని పల్లంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో సమస్యలు తిష్ట వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. ఐదు తరగతులకు నాలుగు గదులు ఉండడంతో విద్యాబోధనకు ఆటంకం ఏర్పడుతోంది. ఆరవ తరగతి క్లాసును వరండాలో నిర్వహిస్తున్నారు. ఈ సమస్య ఇప్పటిది కాదు. గత ఐదు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు 20 ఏళ్ల క్రితం దాతల సహకారంతో నిర్మించిన హైస్కూలు తరగతి గదుల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో భవనాన్ని కూల్చివేశారు. నాడు-నేడు కార్యక్రమంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మూడు గదుల నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు చేశారు. 2024లో పనులు ప్రారంభించి రూ.10 లక్షల వ్యయంతో పునాదులు తవ్వారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ఆగిపోయాయి. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం నాడు-నేడు పనులను నిలుపుదల చేసింది. దాదాపు ఏడాది నుంచి భవన నిర్మాణం పునాది దశలో నిలిచిపోవడంతో తరగతి గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు.

**నాలుగు గదులు..ఐదు తరగతులు**

ప్రస్తుతం ఉన్న భవనంలో ఐదు గదులు ఉన్నాయి. వీటిలో ఒక గదిలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉండగా, మిగిలిన నాలుగు గదుల్లో 7,8,9,10 తరగతులు నిర్వహిస్తున్నారు. 6వ తరగతి క్లాస్‌ను బయట వరండాల్లో నిర్వహిస్తున్నారు. వానాకాలంలో వర్షం జల్లు వరండాల్లోకి రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గత ఐదేళ్లుగా విద్యాబోధన వరండాలోనే నిర్వహిస్తున్నారు. హైస్కూల్లో 157 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్న భవనం కూడా వర్షాకాలంలో నీరు కారుతోందని, గదులు సరిపడక 6వ తరగతి క్లాస్‌ను వరండాల్లో నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయురాలు ఇ.వరలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు ఐదు తరగతి గదులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు రెండు గదులు, స్టోర్ రూమ్ అవసరం ఉందని ఆమె తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇబ్బందులను గుర్తించి అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి వచ్చే విద్యాసంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ బీఆర్ఎస్ కుమారిని వివరణ కోరగా నాడు-నేడు కార్యక్రమంలో చేపట్టిన భవనాల నిర్మాణ పనులను ప్రభుత్వం నిలుపుదల చేసినట్టు ఆమె తెలిపారు.


పునాది దశలోనే ఆగిపోయిన తరగతి గదుల భవన నిర్మాణం


వరండాలోనే చదువుకుంటున్న ఆరవ తరగతి విద్యార్థులు

# కొనసాగుతున్న వైద్య శిబిరాలు

**గోపాలపురం:** మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గోపాలపురం పెద్దగూడెం, చిట్యాల, వేళ్లచింతల గూడెం, పెద్దాపురం, భీమోలు, కొవ్వూరుపాడు, గుడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల ద్వారా సుమారు 30 మందికి సీజనల్ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు అన్నదేవరపేట పీహెచ్‌సీ డాక్టర్ కె నవీన్‌కుమార్ తెలిపారు. డయేరియా కేసులు గుర్తించిన గ్రామాల్లో ఏఎన్ఎం, వైద్యసిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చిందని నవీన్‌కుమార్ తెలిపారు. గోపాలపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దగూడెం, ఉప్పరగూడెం, గొడపేట, రజక పేటల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించినట్లు గ్రామ కార్యదర్శి కె అనురాధ తెలిపారు. కలెక్టర్ పి ప్రశాంతి ఆకస్మిక తనిఖీ అనంతరం పూర్తిస్థాయిలో గ్రామంలో పారిశుధ్యం, మంచినీటి ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. డయేరియా బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు కార్యదర్శి అనురాధ పేర్కొన్నారు.


పెద్దగూడెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్

## అంగన్‌వాడీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**దేవరపల్లి:** గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల్లో తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఎస్సీ ఒకటి, బీసీ రెండు, జనరల్ కేటగిరీకి ఐదు పోస్టులు కేటాయించినట్టు తెలిపారు. గోపాలపురం మండలంలోని రేగులకంట (జనరల్), పెద్దాపురం-2 (జనరల్), గోపాలపురం-9 (బీసీ-బి), దేవరపల్లి-10 ఎస్సీ, నల్లజర్ల మండలంలో నల్లజర్ల-1 (ఎస్టీ), మార్లేళ్లమూడి-1 (బీసీ-సీ), సింగరాజుపాలెం-2 (జనరల్), తూర్పుచోడవరం-3 (జనరల్), తూర్పుచోడవరం-4 (జరల్) కేటగిరీలకు కేటాయించినట్టు వివరించారు. దరఖాస్తులను ఈ నెల 29న సాయంత్రం లోగా గోపాలపురంలోని ఐసీడీఎస్ పీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో పాటు, పదో తరగతి మార్కుల జాబితా, నివాస, కుల, వయస్సు ధ్రువీకరణ, ఆధార్, అంగవైకల్యం, భర్త మరణిస్తే వారి డెత్ సర్టిఫికెట్, మైనర్ పిల్లలుంటే సంబంధిత ధ్రువీకరణ, ప్రీ స్కూలు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని తెలిపారు. దరఖాస్తుదారులు టెన్త్ ఉత్తీర్ణులై, 2024 జులై ఒకటి నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

## ‘విద్యుత్ షాకులు’ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

**నిడదవోలు :** సీపీఎం ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన ‘విద్యుత్ షాకులు’ పుస్తకాన్ని సీపీఎం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు నియంత్రిస్తామని, బిల్లుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ ఆఫ్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు, టైమ్ అఫ్ డే విధానమంటూ దొంగచాటున రూ.వేల కోట్లు ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గుమ్మాపు డేనియల్, గంటి కృష్ణ, ఉస్మాన్, జి. సత్యనారాయణ మూర్తి, మజీద్ భూషణం తదితరులు పాల్గొన్నారు.

## మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు

**కొవ్వూరు:** పట్టణంలో సంత మార్కెట్ సమీపంలో పెందుర్తి సుధారాణి అనే మహిళకు చెందిన మోటారు సైకిల్ ఈనెల 17వ తేదీ రాత్రి అపహరణకు గురైంది.17వ తేదీ రాత్రి ఇంటి ముందు నిలిపిఉంచిన మోటారు సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. 18వ తేదీ ఉదయం నిద్ర లేచి చూసే సరికి మోటారు సైకిల్ కనిపించలేదు. దీంతో పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాత్రి బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

# పది పరీక్షకు 994 మంది హాజరు

**దేవరపల్లి:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. దేవరపల్లి మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. దేవరపల్లిలో మూడు కేంద్రాలు, యర్నగూడెం, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూళ్లలో పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 1,024 మందికి, 994 మంది విద్యార్థులు హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. 29 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్టు చెప్పారు. యర్నగూడెం జెడ్పీ హైస్కూలు కేంద్రంలో ఇద్దరు, శ్రీచైతన్య హైస్కూలు కేంద్రంలో 8 మంది, దేవరపల్లి జెడ్పీ హైస్కూలు కేంద్రంలో ఐదుగురు, దేవరపల్లి భాష్యం స్కూలు కేంద్రంలో 13 మంది, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు కేంద్రంలో ఒకరు పరీక్షకు హాజరుకాలేదని వివరించారు. రెగ్యులర్ విద్యార్థులు 97.16 శాతం, సప్లిమెంటరీ విద్యార్థులు వంద శాతం హాజరైనట్టు తెలిపారు.


దేవరపల్లిలోని ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూలు పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

**పదో తరగతి పరీక్షకు 665 మంది హాజరు**

**తాళ్లపూడి:** మండలంలోని పదోతరగతి పరీక్షల్లో మొత్తం 677 మంది విద్యార్థులకు 665 మంది శుక్రవారం ఇంగ్లీష్ పరీక్షకు హాజరైనట్టు ఎంఈవో 2, రూట్ ఆఫీసర్ సీహెచ్ నెహ్రూజీ తెలిపారు. 12 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదు. తాళ్లపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 131 మందికి 129 మంది, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 258 మందికి 252 మంది, మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 150 మందికి 148 మంది, సీ పరీక్షా కేంద్రంలో 135 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. ఇందులో ప్రైవేట్ విద్యార్థులు ముగ్గురు ఉన్నారు.

# పొగాకుపై ఎండల ప్రభావం

- ఎండిపోతున్న తోటలు
- దిగుబడులపై రైతుల ఆందోళన
- రెలుపులకు బంటాల కొరత
- అందుబాటులో లేని బ్యారన్లు


దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో ఎండిపోతున్న పొగాకు తోట

**దేవరపల్లి:** రెండు వారాలుగా వాతావరణంలో మార్పుల వల్ల ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో దీని ప్రభావం పొగాకు తోటలపై పడిందని రైతులు అంటున్నారు. ఎండల తీవ్రతకు తోటల్లోని మొక్కలు ఎండిపోతున్నాయని, బాగున్న తోటలు కూడా పండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో మంచుతో కూడిన చలి వాతావరణం ఉండడం, పగలు ఎండలు ఎక్కువగా ఉండడంతో వేడిని తట్టుకోలేక మొక్కలు ఎండిపోయి చనిపోతున్నాయని రైతులు తెలిపారు. సకాలంలో ఆకులు రెలిసి క్యూరింగ్ చేద్దామంటే బంటాలు (కూలీలు), క్యూరింగ్‌కు బంటాల సమస్య ఎక్కువగా ఉందని రైతులు తెలిపారు. ఎండలకు కూలీలు కూడా రెలుపులకు రావడం లేదని, బ్యారన్ల వద్ద డ్రైవర్లు ఎండను తట్టుకోలేక అనారోగ్యాలకు గురవుతున్నారని రైతులు తెలిపారు. పొగాకు రెలిసి బ్యారన్‌లో పెట్టిన తర్వాత ఆరు రోజులకు క్యూరింగ్ పూర్తవుతుందని, 7వ రోజున మళ్లీ ఆకులు రెలిసి క్యూరింగ్ చేయాల్సి ఉందని, అటువంటిది తొమ్మిది రోజుల వరకు క్యూరింగ్ జరగడంలేదని రైతు సత్తి జగదీశ్వరరెడ్డి తెలిపారు. దీంతో బ్యారన్ల సమస్య ఎక్కువగా ఉందని రైతులు వివరించారు. దీని వల్ల దిగుబడులు తగ్గే అవకాశం ఉందని. ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో సుమారు 10 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి తగ్గుతుందని రైతులు అంటున్నారు. చివరి మూడు రెలుపుల పొగాకు దెబ్బతిని మాడు గ్రేడు వస్తోందని రైతులు తెలిపారు. దీని వల్ల రైతులు ఆందోళన చెందనవసరం లేదని, దాదాపు పొగాకు రెలుపులు, క్యూరింగ్‌లు ముగింపు దశలో ఉన్నాయని పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు వాడిన తోటలు ఎండకు తట్టుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఆలస్యంగా వేసిన తోటలు ఎండలకు అక్కడక్కడా దెబ్బతిన్నట్టు ఆయన చెప్పారు. దీనివల్ల దిగుబడులు కొంత వరకు తగ్గవచ్చునని ఆయన తెలిపారు.

# చలివేంద్రాలు ఏర్పాటు చేయండి


ఉండ్రాజవరం కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్

**ఉండ్రాజవరం:** వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా మండలంలోని గ్రామ సచివాలయాల్లో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటం వలన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సూచనల మేరకు ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి అధికారులు, వైద్య, ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయం వద్ద, జన సంచారం ఉండే కూడళ్లల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని గ్రామ రెవెన్యూ అధికారులను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

**దాతలను ప్రోత్సహించాలి**

చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను, దాతలను ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ఎండ తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు తమ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసుకుని, ఉదయం 11 గంటలలోపు తమ నివాసాలకు చేరాలని సూచించారు. ఎవరైనా వడదెబ్బకు గురైనట్లు గుర్తించిన వెంటనే సంబంధిత ఆశా, ఏఎన్ఎంలను, సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా బయటకు వస్తే మంచినీళ్లు, మజ్జిగ, చల్లని ద్రవ పదార్థాలు తమ వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**చలివేంద్రం ప్రారంభం**

**చాగల్లు:** బ్రాహ్మణగూడెం బస్టాండ్ సెంటర్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఆర్వో రామకృష్ణ మాట్లాడుతూ ప్రయాణీకులు, వాహనదారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బలక్ష్మి, పి.సుబ్బారావు, జి.వెంకటరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**నల్లజర్ల:** గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీఓ కె.నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని నల్లజర్ల-1 (ఎస్టీ), మార్లెళ్లమూడి-1 (బిసీ సి), సింగరాజుపాలెం-2 (ఓపెన్ కేటగిరి), తూర్పుచోడవరం-3 (ఓపెన్ కేటగిరి), తూర్పుచోడవరం-4 (ఓపెన్ కేటగిరి)కి కేటాయించినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో వివాహిత మహిళలు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు ఉంటే ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

**ఉండ్రాజవరం:** మండలంలో నాలుగు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండలంలో పసలపూడి బీసీ ఈ, కాల్ధారి-2 బీసీ ఈ, కాల్ధారి-3 ఎస్టీ, దమ్మెన్ను ఓసీలకు కేటాయించామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు నివాసం, కులం, 10వ తరగతి మార్కులు లిస్ట్, పుట్టిన తేదీ, అంగవైకల్యం తదితర ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 29 తేదీ సాయత్రం 5 గంటలలోపు పెరవలి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

## ఆదరణ-3 పథకంపై నేడు ప్రణాళిక

**ఉండ్రాజవరం:** ఆదరణ పథకం ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందించేందుకు మండల కుల వృత్తి సంఘాలతో ఈనెల 22న ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీవీపీఎస్ రామారావు శుక్రవారం తెలిపారు. ఈ మండలస్థాయి సమావేశానికి మండలంలోని వెనుకబడిన తరగతుల కుల వృత్తి సంఘం నాయకులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.



## కులవృత్తి సంఘాలతో సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో ఆర్.శ్రీదేవి

**చాగల్లు:** ఆదరణ-3 సమర్థవంతంగా అమలయ్యేలా కుల వృత్తి సంఘాలు సహకరించాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు. చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కులవృత్తి సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ-3 పథకం ప్రవేశపెట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి మండల కుల వృత్తి సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మట్టా వీరా స్వామి, మండల నాయకులు ఆళ్ల హరిబాబు, నాదేళ్ల శ్రీరామ్ చౌదరి, కుల వృత్తి సంఘ నాయకులు, లబ్ధిదారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## గొలుసు దొంగ అరెస్ట్

**కొవ్వూరు:** బైపాస్ రోడ్డులో ఈనెల 19దీన మహిళ మెడలో గొలుసు తెంచుకుని పరారైన నిందుతుడిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ పి.విశ్వం తెలిపారు. బైపాస్ రోడ్డులో వాకింగ్ చేస్తున్న కుందుల పద్మకుమారి మెడలో ఆరున్నర కాసుల బంగారు గొలుసును మోటారుసైకిల్‌పై వచ్చిన వ్యక్తి అపహరించుకుని పోయాడు. ఈ కేసు విచారణానంతరం బొద్దు సూర్యనారాయణ (సూరి) ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందుతుడ్ని అరెస్ట్ చేసి గొలుసును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.నిందితుడు సీతానగరం మండలం కాటవరానికి చెందినవాడని తెలిపారు. రెండు రోజుల్లోనే ఈ కేసులో చేధించిన సీఐ పి.విశ్వం, ఎస్సై కె.జగన్‌మోహన్‌రావును ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**పెరవలి:** జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పెరవలి ఎస్సై వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కానూరుకు చెందిన వెలిగంటి నాగేశ్వరరావు (66) ఈ నెల 20న పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ్జల్లో శెగడ్డలు వేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్న నాగేశ్వరరావు జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగాడని, కుటుంబ సభ్యులు అతడిని వెంటనే తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడని చెప్పారు. భార్య వెలిగంటి మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## 23న మెగా వైద్య శిబిరం

**నల్లజర్ల:** అనంతపల్లిలో ఈ నెల 23న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ కె.కమలకుమారి, ఉపసర్పంచ్ కలం సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. అనంతపల్లి సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన వేద హాస్పిటల్ వెన్నుముక నిపుణులు తేజోఫణీంద్ర, స్త్రీల వైద్యనిపుణురాలు పి.లక్ష్మిమ్మదుల వైద్య సేవలు అందిస్తారన్నారు.